ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబర్ 2024

ఇల్లు నష్టపోయిన వారుంటే నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు నష్టపోయిన వారు గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలకు నష్టపోయిన ఇల్లు, ఇతర వివరాలను ఇప్పటికే సంబంధిత అధికారుల ద్వారా సేకరించి ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని ఆయన చెప్పారు. అయితే ఇంకా ఎవరి ఇల్లు అయినా కూలిపోవడం లేదా పాక్షికంగా దెబ్బతినడం వంటి అంశాలుంటే గ్రామ సచివాలయం వద్ద ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా సంఖ్యతో నమోదు చేసుకోవాలని అన్నారు. వాటిని పూర్తిగా విచారణ చేసిన అనంతరం నివేదికలు సమర్పించడం జరుగుతుందని ఆయన వివరించారు.

ఏచూరి లేని రాజకీయాలను ఊహించలేం

దేశ, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు

క్లిష్టమైన పరిస్థితుల్లో రాజకీయ చతురత

నమ్మిన సిద్ధాంతం కోసం జీవితమే త్యాగం

సంస్మరణ సభలో అశోక్ సహా పలువురి వక్తలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి యావత్తు దేశానికి ఆదర్శనీయులని, ఆయన లేని దేశ రాజకీయాలను ఊహించలేమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సహా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లో ఏచూరి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. దేశ, విదేశాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యుదయ శక్తులు, లౌకికవాదులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారని తెలిపారు. ఇటీవల ఏర్పడిన ఇండియా కూటమి సహా అనేక సందర్భాల్లో దేశంలోని వివిధ రాజకీయ పార్టీలను ఐక్యం చేసిన ఘనత కూడా ఆయనదేనని కితాబిచ్చారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైద్ధాంతిక ఆలోచనలు జోడించి ముందుకు నడపడంలోనూ ఎంతో విజయవంతమయ్యారని కొనియాడారు. ఆదివారం విజయనగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. అశోక్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఏచూరి ఆశయాలు సాధిస్తామంటూ నినాదాలు చేశారు. ఏచూరిపై వక్తల అభిప్రాయాలు...

సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

ఆదర్శనీయుడు సీతారాం ఏచూరి

సీతారాం ఏచూరి ధన్యజీవి. దేశమును ప్రేమించుమన్న.... మంచి అన్నది పెంచుమన్న... అన్న గురజాడ ఆశయం ఆయనలో ఎంతో స్పష్టంగా, లోతుగా కనిపిస్తుంది. ఏచూరితో కలిసి పార్లమెంట్‌లో పనిచేసిన అనుభవం ఉంది. ఎదుటి వ్యక్తి ఆలోచనలు, అభిప్రాయాలను అంగీకరించినా, అంగీకరించకున్నా.. గౌరవించే అలవాటు ఆయనకు ఉంది. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితమంతా కట్టుబడి పనిచేశారు. సిపిఎం భాగస్వామిగా ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్‌లో ఆ పార్టీకి ప్రధాని పదవి వచ్చే అవకాశం దక్కినా, అందుకు తమ పార్టీ సిద్ధాంతం అంగీకరించబోదంటూ తృణపాయంగా తోసిపుచ్చడమే కాకుండా అందుకు గల కారణాలను ప్రజలకు, పార్టీకి వివరించిన వ్యక్తి ఏచూరి. పార్లమెంట్‌లో చురుకుగా పాల్గొంటూ దేశానికి ఉపయోగపడే ఎంతో చర్చ నడిపేవారు. కొన్ని సందర్భాల్లో ఆయన అభిప్రాయాలకు అంగీకారం దొరకనప్పుడు ప్రజాస్వామ్య పద్ధతులకు లోబడి పనిచేశారు. అంతే తప్ప ఇప్పటి నాయకుల మాదిరిగా దుర్భాషలాడడం ఆయన రాజకీయ చరిత్రలో లేదు. ఏచూరికి దేశభవిష్యత్తు పట్ల, రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఉందన్న విషయం ఎవరైనా అంగీకరించక తప్పదు. ఆయన బాటలో నిలబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

- పూసపాటి అశోక్ గజపతిరాజు, కేంద్ర మాజీ మంత్రి

అపారమైన మేధో సంపత్తి

ఏచూరి అత్యంత ధైర్య సాహసవంతమైన, అపారమైన మేధో సంపన్నమైన నాయకుడు. దేశం విచ్ఛిన్నకర ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాస్వామ్య విలువలకు లోబడి, తన తెలివితేటలు జోడించి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అనేక బిల్లులపై ప్రజాకోణంలో చర్చ జరిపి లోపాలను ఎత్తిచూపారు. రాష్ట్ర విభజన సమయంలోనూ ఎపికి నష్టం జరగకుండా ప్రత్యేక హోదా, ఇతర అంశాలపై జాతీయ స్థాయిలో గట్టిగా మాట్లాడింది ఏచూరియే. దేశ సమగ్రత కోసం నిరంతరం ఆయన పోరాడారు.

- బీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు

లౌకిక విలువల కోసం అలుపెరుగని పోరాటం

దేశ సమైక్యత, లౌకిక విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటం చేశారు. యునైటెడ్ ఫ్రంట్, యుపిఎ -1 ప్రభుత్వంలోనూ ఏచూరి పాత్ర అత్యంత కీలకంగా ఉండేది. యుపిఎ-1 ప్రభుత్వంలో కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకర్త కూడా ఆయనే. ఫలితంగా సమాచార హక్కుచట్టం, ఉపాధి హామీ చట్టం, అటవీ గిరిజన హక్కుల చట్టం, ఆహార భద్రతా చట్టం సహా అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయి. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీని సైతం ఢిల్లీ జెఎన్‌యు ఛాన్సలర్ పదవి నుంచి రాజీనామా చేయించి చరిత్ర సృష్టించారు.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

గొప్ప నాయకుడిని కోల్పోయాం

ఏచూరి గొప్ప నాయకుడు. పార్టీ ఏదైనా ప్రజల కోసం పనిచేసే నాయకులు, వ్యక్తులు సమాజానికి అవసరం. అటువంటి కోవకు చెందిన వారే ఏచూరి. అందులోనూ తెలుగు వ్యక్తి కావడం పలు సందర్భాల్లో గర్వంగా ఉండేది. ఆయన లేని లోటు తీరనిది.

- పి.అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మడమ తిప్పని నాయకుడు ఏచూరి

దేశ ప్రయోజనాలు కాపాడే క్రమంలో ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినా ఏచూరి వెరవలేదు. నమ్మిన సిద్ధాంతం అమలుకు, దేశ ప్రజల సేవకు అంకితమై పనిచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి, మారుతున్న పరిస్థితులను అంచనా వేయడంలో ఆయనకు ఉన్న అవగాహన, సమాజం పట్ల ఆయనకు ఉన్న స్పష్టత ఎనలేనివి. దీనికితోడు నిరంతర అధ్యయనంతో ముందుకు సాగారు. ప్రజాశ్రేయస్సే ఏకైక అజెండాగా ముందుకు సాగిన, సాగించిన ఏచూరి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

- కిమిడి నాగార్జున, టిడిపి జిల్లా అధ్యక్షులు

కార్మిక ఉద్యమానికి తీరని లోటు

ఏచూరి మరణం కార్మిక ఉద్యమానికి, లౌకిక శక్తులు, అభ్యుదయవాదులకు తీరని లోటు. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినప్పుడు, మతోన్మాదం పెచ్చుమీరుతున్న ప్రతిసారీ ఏచూరి తనదైన శైలిలో తిప్పికొట్టేవారు. ఆయన తల్లిదండ్రులు డాక్టరో, ఐఎఎస్ ఆఫీసరో చేయాలని కలలు కన్నప్పటికీ, ఆ పరిమితులకు మించిన సేవలందించాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చారు. విద్యార్థి దశలో ఎత్తిన ఎర్రజెండా తుదిశ్వాస విడిచేవరకు దించకుండా పనిచేస్తూ ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయవాదులకు ఆదర్శంగా నిలిచారు.

- తమ్మినేని సూర్యనారనాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఏచూరి అసాధారణమైన నేత

సీతారాం ఏచూరి అసాధారణమైన నాయకుడు. పార్టీ ఉద్యమంలో భాగంగా ఆయనతో నాకు అనుబంధం ఉంది. కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉండేవారు. జాతీయ మహాసభల్లోనూ చాలాసార్లు నేను పాల్గొన్నాను. మా పార్టీ అంతర్గత సమావేశాల్లో గానీ, వివిధ పార్టీలు అనుసరిస్తున్న రాజకీయ విధానాల పట్ల గానీ ఆయనకు ఎంతో స్పష్టమైన అవగాహన ఉండేది. అందువల్ల మహాసభల్లో సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ పార్టీ రాజకీయ విధానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఆయనకే దక్కేది. తప్పక ఆమోదం లభించేది. దాన్ని తిరిగి ఆయనే ప్రతినిధులకు వివరించేవారు. అంతగొప్ప అరుదైన వ్యక్తిత్వం, మేధోశక్తి, సామర్థ్యాలు ఉన్న నాయకుడు. ఆయన కేవలం దేశ రాజకీయాలకే పరిమితం కాలేదు. ఎన్నో దేశాల్లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కారం చూపారు.

- ఎం.కృష్ణమూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు

పోరాట యోధుడు ఏచూరి

ఏచూరి గొప్ప పోరాట యోధుడు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేవలం ఈ పార్టీని ముందుకు నడిపించడానికే పరిమితం కాలేదు. మారుతున్న దోపిడీ విధానాలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసి, వాటిపై పోరాటానికి ఇతర పార్టీలను కూడా ఐక్యం చేసిన గొప్ప నాయకుడు. రాజకీయ శత్రువులను ఎంత సూటిగా ప్రశ్నించేవారో? అందులో అంతే సున్నితత్వం కనిపించేది. అందుకే ఏచూరికి దేశ, విదేశాలకు చెందిన ఎన్నో పార్టీల ప్రతినిధులు , అభ్యుదయవాదులు నివాళులర్పించి, విచారం వ్యక్తం చేశారు. ఇంతటి మేధావి అయినా నిత్యం నిగర్వంగా కనిపించేవారు. చివరికి ఆయన శరీరాన్ని కూడా ఎయిమ్స్‌లో మెడికల్ విద్యార్థుల ప్రయోగాలకు అప్పగించడం ఆయన ఆశయాలకు తార్కాణం.

- దయానంద్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఏచూరి మరణం తీరనిలోటు

ఓ వైపు లౌకికవాద శక్తులపై దాడులు, మరోవైపు మతోన్మాదం పెచ్చురిల్లుతున్న తరుణంలో నిరంతరం దేశ సమగ్రత కోసం పోరాడే సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు. కేవలం దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసమే కాకుండా ప్రపంచ దేశాలను ఐక్యం చేసేందుకు పరితపించే ఏచూరి ఎన్నో సవాళ్లను అధిగమించి రాజకీయాలను ముందుకు నడిపించారు. ప్రజాతంత్ర ఉద్యమాలకు ఎప్పటికప్పుడు ఊపిరిపోశారు.

- బెహరా శంకరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు

అభిప్రాయాల్ని విభేదించినా... వ్యక్తుల్ని గౌరవించారు

ఏచూరి సిద్ధాంత పరంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల అభిప్రాయాల పట్ల విభేదాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ నాయకుల పట్ల ఎల్లప్పుడూ గౌరవంగానే మెలిగేవారు. అందువల్లే ఎన్నో సందర్భాల్లో పలు పార్టీలను ఐక్యం చేసి ప్రజావ్యతిరేక నిర్ణయాలు, చట్టాలపై పార్లమెంట్‌లో గళం విప్పారు. ఈ రకంగా ఏచూరి నాకు నచ్చిన లీడర్. ఎదుటి మనిషి లేదా పార్టీని నొప్పించకుండా నిస్సంకోచంగా నిలదీసే శక్తి సామర్థ్యాలు ఏచూరికే చెల్లిందనడంలో సందేహం లేదు.

- ఎం.విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

ఏజెన్సీని వీడని జ్వరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీని జ్వరాలు వీడడం లేదు. మన్యం ప్రాంతంలో ఏ గ్రామం వైపు చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. వాతావరణంలో కాలుష్య ప్రభావం, కలుషిత నీరు, దోమలు వ్యాప్తి కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. వివిధ రకాల రోగాలతో వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు బెడ్లు చాలడం లేదు. ఒక్కొక్క మంచంపై ఇద్దరు ముగ్గురేసి రోగులు వైద్యం పొందుతున్నారు. వైద్యం కోసం ఎక్కువగా వస్తున్న వారిలో విద్యార్థులు, మహిళలు, వృద్ధులే కనిపిస్తున్నారు. ఎక్కువ శాతం మంది వైరల్ జ్వరాలు, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి వ్యాధుల లక్షణాలతో వైద్యం కోసం వస్తున్నారు. రోజువారీ ఒపి 100 నుంచి 120వరకు నమోదవుతుంది. అలాగే మండలంలోని రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జ్వర పీడితులు అధిక సంఖ్యలో ఉన్నారు. మరోవైపు కురుపాం, జియమ్మ వలస మండలాల పరిధిలో గల గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఏజెన్సీలో కొంతమేర ప్రభుత్వ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నా మైదాన ప్రాంతంలో మాత్రం ప్రైవేటు వైద్యం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. భద్రగిరి సిహెచ్‌సి సమీపంలో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు గత ఏడాదికాలంగా నిలిచిపోయాయి. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

ఆదివాసీ ఆరోగ్యం కనుమరుగు

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించేవారు. విద్యా సంస్థలు మొదలుకొని కెజిహెచ్ వరకు హెల్త్ వాలంటీర్లను నియమించి గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించేవారు. ఐటిడిఎలో ఒక వైద్యాధికారి, మోనటరింగ్ అధికారి ఉండేవారు. సీరియస్ కేసులను ఇక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించే బాధ్యత వహించేవారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలందడంతో మరణాలు అదుపునకు వీలుండేది. వైసిపి ప్రభుత్వం హెల్త్ వాలంటీర్లను తొలగించింది. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో హెల్త్ వాలంటీర్లను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటన చేసిన నేటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

ఆసుపత్రులకు క్యూకడుతున్న రోగులు


ఒకే మంచం పై చికిత్స పొందుతున్న యువత

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ఏజెన్సీ మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలి. గ్రామాల్లో ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్, దగ్గు, తలనొప్పి, కాళ్ల నొప్పులు వంటి లక్షణాలతో గిరిజనులు బాధపడుతూ కనిపిస్తున్నారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వర్కర్లను నియమించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి

ఏజెన్సీ ప్రాంతంలో గల సిహెచ్ సి, పిహెచ్‌సిల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలి. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్ల వద్ద మలేరియా మందుల్లేకపోవడంతో గిరిజనులు వైద్యం కోసం దూర ప్రాంతం ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. ఎటువంటి సమస్యల్లేకుండా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది దృష్టి సారించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే లడ్డూ వివాదం : రాజన్నదొర

ప్రజాశక్తి -సాలూరు

వందరోజుల తన ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సిఎం చంద్రబాబునాయుడు తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని తెరపైకి తెచ్చారని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆరోపించారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారే మనస్తత్వం చంద్రబాబు దని అన్నారు. దీనిపై ఇప్పటికే మాజీ సిఎం జగన్ ప్రధానికి లేఖ రాశారని, లడ్డూ కల్తీకి సంబంధించిన వివాదంపై వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరినట్లు చెప్పారు. లడ్డూ తయారీకి సంబంధించిన సరుకుల కొనుగోలు, నాణ్యత పరిశీలనకు కమిటీలు ఉన్నాయని అన్నారు. జూలైలో లడ్డూ కల్తీకి జరిగిందని నివేదిక ప్రభుత్వానికి అందితే ఇంతవరకు ఎందుకు నోరు మెదప లేదని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు నాయుడు మాట్లాడారని, ప్రజలు ఎప్పటికీ క్షమించరని చెప్పారు. టిడిపి ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ వివాదం పై సిబిఐ లేదా సుప్రీంకోర్టు జడ్జి తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైసిపి అధినేత జగన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తారని, ఇప్పటికే పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు.

విద్యార్థుల మరణాలపై స్పందించరేమీ?

ఏజెన్సీలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని రాజన్నదొర చెప్పారు. గడచిన మూడు నెలల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు ఏడుగురు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మరణించారని అన్నారు. మన్యం జిల్లాలోనూ విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం ఫైలుపై తొలి సంతకం చేశానని చెప్పుకున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇంతవరకు ఎఎన్ఎంల నియామకం చేపట్టలేదని చెప్పారు. వైసిపి హయాంలో గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వ హత్యలని వ్యాఖ్యలు చేసిన మంత్రి సంధ్యారాణి, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇప్పుడు ఏం చెపుతారని ప్రశ్నించారు. ప్రయివేటు రంగంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీనివల్ల ఎంతోమంది పేద విద్యార్థుల ఆశలు అడియాసలవు తాయని అన్నారు. గతంలో వైద్య కళాశాలల్లో సీట్లు పెరగడం వల్ల నే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కుమార్తెకు మెడిసిన్ సీటు వచ్చిందని గుర్తు చేశారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ అబ్దుల్ పాల్గొన్నారు.

27న సీతంపేటలో 5డి థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో 5డి థియేటర్‌ను ప్రారంభించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆదివారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడలి వ్యూ పాయింట్‌తో పాటు అక్కడ ఏర్పాటు చేసిన టెంటెడ్ అకామడేషన్, రెస్టారెంట్ ప్రారంభించనున్నట్టు చెప్పారు. అడలి వద్ద ఫుడ్ కోర్టులు, వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. అడలి వెళ్లే మార్గంలో సవర కళలతో కూడిన స్వాగత తోరణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజన సంస్కృతి, జిల్లా పర్యాటక అభివృద్ధికి సూచకగా వివిధ కళారూపాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్ప ప్రదర్శన లేదా సాండ్ ఆర్ట్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అడలి వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటక వేడుకలకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని చెప్పారు. సభాస్థలి వద్ద గిరిజన సాంస్కృతిక కళా ప్రదర్శనలు, సాంప్రదాయక సవర డాన్స్ వంటి నృత్య కళను ఏర్పాటు చేయాలని చెప్పారు. వేడుకలు వద్ద ఫుడ్, గేమ్ జోన్‌తో పాటు చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలతో ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. పారాగ్లైడింగ్ వంటి అంశాలను ఏర్పాటుకు యోచించాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎపిఒ జి.చినబాబు, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.అన్నాదొర, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ సింహాచలం, డిఇఒ గార పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ లో పోటీని తట్టుకోవడం కష్టమే

- మహిళా మార్ట్‌ల వ్యాపారం లాభసాటిగా లేదు
- వంద రోజుల్లో 1165 సంఘాలకు రూ.72 కోట్ల రుణాలు
- ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ వై.సత్యంనాయుడు ముఖాముఖి

బహిరంగ మార్కెట్లో షాపింగ్ మాల్స్, ఇతర పెద్ద పెద్ద మార్ట్‌ల పోటీని తట్టుకుని మహిళా మార్ట్‌లు నిలదొక్కుకోవడం కష్టమేనని డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో మహిళా మార్టుల ద్వారా చేపడుతున్న వ్యాపారం అంత లాభసాటిగా లేదన్నారు. డిఆర్‌డిఎ ద్వారా మన్యం జిల్లాలో చేపడుతున్న కార్యకలాపాల గురించి ఆయన 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి, పార్వతీపురం



? జిల్లాలో ఎన్ని మహిళా మార్ట్ లున్నాయి?ఎన్ని ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేశారు?

మన్యం జిల్లాలో వీరఘట్టం మండలంలో ఒక్కటే మహిళా మార్ట్ ఏర్పాటైంది. ఇది కూడా పెద్ద లాభసాటిగా లేదు. నెలకు రూ.20వేలు మాత్రమే లాభం వస్తోంది. మార్కెట్లో పెద్ద పెద్ద మార్ట్‌ల పోటీని తట్టుకుని నిలబడడం కష్టమే. అందుకే మిగిలిన మండలాల్లో మార్ట్‌ల ఏర్పాటు యోచన లేదు.

? మార్ట్ ల ఏర్పాటు కు నిధులెలా స్వీకరిస్తారు?

మహిళా సంఘాల సభ్యులు తలా కొంత ఎత్తుకోగా వచ్చిన సొమ్ముతో మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో అన్ని మండలాల్లో మార్ట్‌లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే సాధ్యాసాధ్యాలు పరిశీలించిన తర్వాత ముందుకెళ్తున్నాం. ఒక్కో మహిళా సంఘ సభ్యురాలు రూ.200 నుంచి రూ.300 వరకు ఎత్తుకుని మార్ట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అయితే మార్కెట్‌లో పోటీ దృష్ట్యా సంఘాల సభ్యుల సొమ్మును తిరిగి ఇచ్చేయాలని ఆదేశాలిచ్చాం.

? జిల్లాలో అన్ని రకాల పింఛన్లు ఎన్ని? కొత్త పింఛను కోసం దరఖాస్తు స్వీకరణ ఎప్పుడు?

జిల్లాలో అన్ని రకాల పింఛన్లు లక్షా 43వేల 185. కొత్త పింఛను కోసం దరఖాస్తులు స్వీకరించాలనేది ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

? మహిళల స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా?

జిల్లాలో పలు చోట్ల మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సాలూరు మండలం పెదపథం పంచాయతీ పాలికవలసలో వందన్ వికాస్ కేంద్రం ద్వారా మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నాం. అదే మండలం తోణాంలో అప్పడాలు, పచ్చళ్ల తయారీపై శిక్షణ కల్పిస్తున్నాం. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన మహిళలకు రకరకాల బిస్కెట్ల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. ఎనిమిది సబ్ ప్లాన్ మండలాల్లో కొండ చీపుర్ల తయారీలో మహిళలకు శిక్షణ కల్పిస్తున్నాం.

? ఎన్ని సంఘాలకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇచ్చారు?

జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా 2వేల స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 1165 సంఘాల కు రూ.72 కోట్లు రుణాలు ఇంతవరకు మంజూరు చేయించాం. స్త్రీనిధి ద్వారా రూ.20 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, రూ.1.9 కోట్లు ఇంతవరకు పంపిణీ చేశాం. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూ.2కోట్లు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఐదుగురు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోలు పంపిణీ చేశాం. ఉన్నతి కార్యక్రమం ద్వారా 50వేల నుంచి రెండు లక్షల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయొచ్చు.

? జిల్లాలో ఎన్ని గ్రామైక్య సంఘాలు వున్నాయి? విఒఎల తొలగింపుపై రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా?

జిల్లాలో 585 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. విఒఎల తొలగింపుపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. గ్రామైక్య సంఘాల తీర్మానంతోనే విఒఎల తొలగింపు సాధ్యమవుతుంది. ఎవరో ఒత్తిడి చేస్తే తొలగించడం సాధ్యం కాదు.

సమావేశంలో మాట్లాడుతున్న మేధావులు

సుందర పార్వతీపురం కోసం కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్వచ్ఛమైన, సుందరమైన, ఆరోగ్యకరమైన పార్వతీపురం కోసం అందరూ కృషి చేద్దామని జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆశ్రమంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలోని పలువురు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని తీర్మానించారు. అందరికీ ఆమోదయోగ్యమైన ఆలోచనలతో ముందుకు సాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్టోబర్ రెండు నుండి ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారాన్ని కూడగట్టాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈనెల 29న మరో సమావేశం ఏర్పాటు చేసి ముందుకు సాగాలని నిర్ణయించారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎటిపిఎఫ్, జన విజ్ఞాన వేదిక, రెడ్ క్రాస్ సొసైటీ ,చెరువుల సంరక్షణ సమితి సభ్యులు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు, కాలువలు, పరిసరాల పరిశుభ్రత, చెత్త సంపద కేంద్రాలకు చెత్త తరలింపు, హరితరాయబారులకు వైద్య సేవలు అందజేయడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాలకు మండల స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమించబడి వారు కూడా పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతోపాటు ఆరు రోజులపాటు ప్రభుత్వం అమలు చేసిన మనమంచిప్రభుత్వం కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

కృషి స్కూల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి జంక్షన్‌లో ఉంటున్న కృషి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం విజయవాడ బాధితులకు సుమారు రూ.38,546 సేకరించారు. ఈ నిధులతను భవానీపురం పరిధిలో ఉన్న ఊర్మిళా నగర్ వాసులకు ఈ విరాళాలను అందజేశారు. ఈ సహాయం చేయడంలో ముఖ్య పాత్ర వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పాఠశాల కరెస్పాండంట్ డి.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జీడి తోటలో అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణ్ అన్నారు. మండలంలోని ఎల్విన్ పేట పంచాయితీ ఎస్కే పాడు కాలనీలో గిరిజన రైతు కద్రక సన్నాయి జీడి, మామిడి తోటలో అంతర్ పంటలపై రైతులకు, మహిళా రైతులకు అవగాహన కలిగించారు. అంతర్ పంటలుగా వేరుశనగ, చిక్కుడు, జునుములు, తోటకూర, గోంగూర, ఆనప, బీర, ముల్లంగి, టమోటా, బెండ, బంతి తదితరి అంతర పంటలను వేస్తూ అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చునన్నారు. పై పంటలు అనంతరం మిగతా రోజుల్లో మినుములు, పెసలు, నువ్వులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలకు కావాల్సిన కషాయాలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిసి సుందర్ రావు, దాశరధి, ఐసిఆర్‌పి దీప, చామంతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మాజీ సైనికుల అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సైనిక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుకు అంగీకరించి క్యాబినెట్ మీటింగ్లో నిర్ణయం తీసుకోవడం పట్ల పార్వతీపురం మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి, సాలువాతో సత్కరించి ప్రభుత్వం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తాము కలలు కంటున్న సైనిక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటును నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ పరిణామం, దీనివల్ల ఎన్నో మాజీ సైనిక కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.నారాయణరావు, సభ్యులు టి.చంద్రశేఖరరావు, జి.శంకర్రావు, జి.సింహాచలం, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బడిదేవరకొండకు పూజలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెలగవలస పంచాయతీ పరిధిలోని బడిదేవరకొండకు పెద్ద బొండపల్లి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా వర్షాలు బాగా కురిసి వ్యవసాయ పనులు పూర్తి అయిన వెంటనే మండలంలోని పలు గ్రామాల ప్రజలు బడిదేవర కొండకు పాయసం సమర్పించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఆనవాయితీని అనుసరించి ఆదివారం పెద బొండపల్లితోపాటు పరిసర గ్రామ ప్రజలు ట్రాక్టర్లపై పెద్ద ఎత్తున తరలివెళ్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

బడిదేవర కొండపై పూజలు చేస్తున్న గ్రామస్తులు

బడిదేవరకొండ జోలికొస్తే ఖబడ్దార్

ప్రజాశక్తి - పార్వతీపురం

మైనింగ్ చేస్తామంటూ బడిదేవరకొండ జోలికొస్తే బడిత పూజ తప్పదని జనసేన నాయకులు ఎ.మోహన్‌రావు హెచ్చరించారు. ఆదివారం జనసేన కార్యకర్తలతో కలిసి బడిదేవరకొండను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వీకుల నుండి గిరిజనుల ఆరాధ్య దేవత బడిదేవరమ్మ తల్లి కొండను నాశనం చేసేందుకు అధికారులు, పాలకులు కంకణం కట్టుకోవడం బాధాకరమన్నారు. కొండను తమ దైవంగా కొలుస్తున్న గిరిజనుల మనోభావాలు వారికి పట్టకపోవడం బాధాకరమన్నారు. బడిదేవరకొండను రక్షించుకునేందుకు గిరిజనులతో పాటు తాము పోరాటం చేస్తామన్నారు. సిపిఎం నాయకులు పాలమెట్ట రాముతో పాటు, గిరిజన పెద్దలు, ఆయా 8 గ్రామాలకు చెందిన పెద్దలు, కాంట్రాక్టర్ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదట్లో ఫారెస్ట్ భూములని అడ్డుకున్న అధికారులకు తరువాత కొండపై భూములు రెవెన్యూ భూములుగా ఎలా మారాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కరుణ, పిన్నింటి తులసీదాస్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, ఇజ్జడ కాళీ, రఘుమండల అప్పలనాయుడు, బెజ్జిపురం శ్రీనివాస్, పడాల జయరామ్, బొంగు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలనకు వంద రోజులు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

వంద రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వంద రోజుల్లో సాలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఆర్థికంగా ఎన్నో సవాళ్ళు, ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజలందరికీ న్యాయం చేస్తూ ప్రతి గ్రామాన్ని, ప్రతీ వార్డ్‌ను అభివద్ధి చేసుకునేందుకు వంద రోజుల పండుగను ప్రజల మధ్య జరుపుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే మే నెలలో పెంచిన పెన్షన్ మొత్తాన్ని బకాయిలతో కలిపి మొదటి నెల ప్రతి ఇంటికి వెళ్లి రూ.7వేలు అందజేశామన్నారు. అలాగే మెగా డీఎస్సీ ద్వారా 16,437 పోస్టుల భర్తీకి ప్రణాళిక సిద్ధం చేశామని ఆమె చెప్పారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా 1300 మంది యువత శిక్షణ తీసుకుంటున్నారని, వారికి మధ్యాహ్నం భోజనంతో పాటు, ఉచిత మెటీరియల్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేయాగా, కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. పేద ప్రజల కడుపు నింపడానికి అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై గత ప్రభుత్వ నాయకుల ఫోటోలను తొలగించి ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పిస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని వివరించారు. ఉద్యోగస్తులకు నెల మొదటి రోజునే జీతాలు అందుతున్నాయని ఆమె పేర్కొన్నారు. అలాగే ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు పథకాన్ని దీపావళి నుండి ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమం నియోజకవర్గం ప్రత్యేక అధికారి మరియు జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, పలువురు అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

సీతానగరం : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని గెడ్డలుప్పిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించడంతో పాటు కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం గతవంద రోజులుగా ఎన్‌డిఎ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మొదటిసారిగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జావేద్, తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంఇఒ సూరిదేముడు, ఎఒ అవినాష్, పశు వైద్యాధికారి రామారావు, మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యంనాయుడు, కార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడు, సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, కర్రి శంకరరావు, వాకాడ తిరుపతిరావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో కుమ్మరిగండిలో ఇది మంచి ప్రభుత్వం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా కుమ్మరిగండి, తాలాడ, కోతాం, చాకలిగూడలో పర్యటించి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని శిఖబడిలో మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎంపిపి బొంగు సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతవరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను గుర్తు చేస్తూ రానున్న రోజుల్లో ఏదైతే సూపర్ సిక్స్ హామీలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని గుమ్మ, ఏగులవాడ పంచాయతీలో మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలన ప్రజలకు చేసినటువంటి మేలు గూర్చి వివరించి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం కూటమి నాయకులు ఎం.వెంకటరమణ, పుండరీకం, వి.శ్రీనివాసరావులు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వంద రోజులు పరిపాలన కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించి, స్టిక్కర్ను అంటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాలూరు పట్టణంలో స్టిక్కర్లు అతికిస్తున్న మంత్రి సంధ్యారాణి

సభలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

సీతానగరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతంపేటలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

తాగునీటి సమస్యపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణాన్ని తాగునీటి సమస్య తీవ్ర వేధిస్తుందని, తరాలు మారినా నీరు రంగు మారడం లేదని, దీనిపై సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. ఈ మేరకు రౌండ్‌టేబుల్‌ను విజయవంతం చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వీధుల్లో పర్యటించి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ నాగావళి, జంఝావతి రెండు జీవ నదులు చెంతనే ఉన్నా పార్వతీపురం పట్టణ ప్రజలకు తాగునీరు లేదని, ప్రజలు తాగునీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వారానికి రెండు, మూడు రోజులకో సారే నీరు ఇస్తున్నారని, వారాని ఒక రోజు నీరిచ్చే రోజులూ కూడ ఉన్నాయని తెలిపారు. ఇచ్చే నీరు కూడా బురద నీరేనని అన్నారు. ఆ నీరు కూడా ఇంట్లోకి రాదు. పట్టణంలో ఎన్నో ఇళ్లు కొత్తగా వచ్చాయని, అపార్టుమెంట్లు కూడా ఏర్పడాయని, నర్సిపురం, అడ్డాపుశీల, కష్టపల్లి వెంకంపేట, బాలగుడబ నలుదిశలా పట్టణం విస్తరించిందని అన్నారు. పార్వతీపురం కేంద్రంగా జిల్లా ఏర్పడడంతో కొత్తగా ఎన్నో జిల్లా ఆఫీసులు, ఆసుపత్రులు, హెరీటల్స్, విద్యా సంస్థలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు వచ్చాయని, ఇంకెన్నో వస్తాయని, పట్టణానికి నీరే లేకుంటే పెరిగిన తాగునీటి అవసరాలకు ప్రతి రోజూ మున్సిపాలిటీ నీరు ఎలా ఇవ్వగలదన్నారు. కావున, ఈ పరిస్థితిపై చర్చించేందుకు ఈనెల 23న ఉదయం 11 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్ ఆఫీసులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తప్పకుండా పట్టణ మేధావులు, మహిళలు, ప్రజలు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, ఐద్వా నాయకులు ఎం. గౌరి, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పి. సన్యాసి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్ మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

మంచినీటి సమస్యపై వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పత్తికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులకు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పత్తి కొనుగోలు కేంద్ర ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద ఆదివారం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో 3వేల ఎకరాల వరకు పత్తి సాగవుతుందన్నారు. ఈ ఏడాది కొంతవరకు వర్షాలు అనుకూలంగా ఉండడంతో పత్తి సాగు కొంత ఆశాజనకంగా ఉందన్నారు. గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లా ఉండే సందర్భంలో సాలూరు, రామభద్రపురంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ రైతులు తమ పత్తిని రామభద్రపురం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకెళ్లడానికి చాలా రవాణా ఛార్జీలు ఎక్కువ అయ్యాయన్నారు. కావున పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వంద కేజీల పత్తికి రూ.15000 గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు . ఈ కార్యక్రమంలో పత్తి రైతులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు గురజాడ అప్పారావు జీవిత చరిత్ర విద్యార్థిచే చదివించారు. అలాగే పాటలు, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు.

అభివృద్ధి పనులు ఎవరు చేస్తారు : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రతి ప్రభుత్వం సంక్షేమమే పరమావధి గా పనిచేస్తే మిగతా మౌలిక సదుపాయాలను ఎవరు కల్పిస్తారని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్ వై నాయుడు మాట్లాడుతూ సాలూరు -మక్కువ, దుగ్గేరు రెగ్యులర్ బస్‌లను బాగువలస మీదుగా గతంలో తిరిగేవని, కానీ రోడ్డు బాగులేదని కారణంతో ఈ బస్‌లను నిలిపివేసి మామిడిపల్లి మీదుగా వేశారని అన్నారు. దీనివల్ల ఈ రహదారిలో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్యులు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించారు. రోడ్లు బాగు చేయాలేగానీ, నిత్యం తిరుగుతున్న బస్‌లను ఆపి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం పాలకులకు తగునా అని ప్రశ్నించారు. వైసిపి, నేడు కూటమి ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలపై చూపించిన శ్రద్ధ అభివృద్ధిపై చూపడంలేదని విమర్శించారు. ప్రజలకు కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదకన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ రహదారి వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలందరితో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు రవి, రాము పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దుచేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగుడబ గ్రామ రెవెన్యూ పరిధిలో గత కొంత కాలంగా నిర్వహిస్తున్న మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని చినగుడబ, కొంకడివరం, సన్యాసిరాజుపేట పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు. మండలంలోని చినగుడబలో ఆదివారం నిర్వహించిన సర్వజన సభలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు తీవ్ర నష్టం కుర్చే పద్ధతిలో నిర్వహిస్తున్న ఆత్యంత మైనింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని, మైనింగ్ అనుమతులు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ వల్ల చినగడబ, పెదగుడబ, కొండవరం పంచాయతీల్లో తాగు, సాగునీటి వనరులు పూర్తిగా దెబ్బ తిన్నాయని, రహదారుల పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. కాలుష్యం బారిన పడి వందలాదిమంది ప్రజలు కిడ్నీ రోగాలకు గురై బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2021లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా కూడా మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని తీర్మానం ఇచ్చినప్పటికీ అధికారుల దొడ్డిదారిన అనుమతులు మంజూరు చేయడం దుర్మార్ధ మైన చర్యని తెలిపారు. ఇప్పటికైనా వేలాదిమంది ప్రజల పంటలకు నష్టం చేకూర్చి, ఆరోగ్యానికి హానికరమైన అత్యం మైనింగ్ కార్యకలాపాలను రద్దు చేయాలని, లేనిచో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ మైనింగ్ విషయమే ఇప్పటికే ఎంపి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మైనింగ్ అనుమతి రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. అలాగే ఈ సభలో చినగుడబకు చెందిన విశ్రాంత డిఎస్‌పి ఎంవి నాయుడు, సిఐ ఆలుబిల్లి విశ్వేశ్వరరావు, జనసేన నాయకులు శంకర్రావు సిపిఎం నాయకులు బి వి రమణ, చినగుడబ, వల్లరిగుడబ, సన్యాసిరాజుపేట సర్పంచులు దుర్గాప్రసాద్, గోవింద నాయుడు, మదుబాబు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వజన సభలో గ్రామస్తులు

సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బివి రమణ

చెత్తను తరలించాల్సిందే

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగరపంచాయితీ ఎదురుగా వేస్తున్న చెత్త కొండలా పేరుకుపోయి చుట్టుపక్కల ప్రజలకు ఆరోగ్య సమస్యలు సృష్టిస్తుందని తక్షణమే సిపిఎం పట్టణ కార్యదర్శి దావాల రమణారావు అన్నారు. గతం నుండి పోరాటం చేస్తుంటే స్వయంగా నగర పంచాయితీ అధికారులే వారం రోజుల్లో ఈ చెత్తను ఇక్కడ నుండి తరలిస్తామని ఈ నెల 12న హామీ ఇచ్చారని అది ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణమని అన్నారు. అధికారులు, పాలకవర్గం ఇప్పటికైనా స్పందించి ఇక్కడ నుండి చెత్తను తరలించకపోతే ప్రజా పోరాటాలకు సిద్దమవుతామని ఆయన హెచ్చరించారు. టిడిపి, వైసిపి వారు మీది తప్పు అంటే మీది తప్పు అని నిందలు వేసుకోవడం మానేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రశ్నిస్తే విమర్శలు చేయడం తప్ప సమస్య పరిష్కారం కోసం పాలక, ప్రతిపక్షాలు ప్రయత్నం చేయడం లేదని అన్నారు. వెంటనే దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి గిరిజన సంఘాలు ఐక్యం కావాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనుల పేరిట నకిలీ ధ్రువపత్రాలు పొంది సుమారు 250 మంది ఉద్యోగాలు విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపై న్యాయ స్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పూర్తి అయ్యేలా కృషి చేయడానికి జిల్లాలో అన్ని గిరిజన సంఘాలు ఐక్యం కావాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు నిమ్మక జయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం కురుపాంలో గల కెటిఆర్ ఒకేషనల్ కళాశాలలో గిరిజన సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా గ్రామసభ కమిటీ స్వయం పాలన ఎన్నికలు 216 గిరిజన పంచాయితీలల్లో నిర్వహించాల్సిఉన్నప్పట్టికీ కేవలం 77 పంచాయితీలో మాత్రమే నిర్వహించడం దారుణమని అన్నారు. కావున 216 గిరిజన పంచాతీల్లో పీసా గ్రామ సభ ఎన్నికలు నిర్వహించి వాటిలో విద్యావంతులతో నియామకం చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సాలూరు మండలంలో మహిళా ఎంపిటిసిపై జరిగిన భౌతిక దాడి చేసి వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నేటి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ జీవో 3ను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఆరిక నీలకంఠం, జెఎసి సభ్యులు, ఆదివాసీ వికాస్ పరిషత్, గిరిజనాభ్యుదయ సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్ అసోసియేషన్, గిరిజన సమాఖ్య, గిరిజన ఉద్యోగుల సంఘం, షెడ్యూల్ ఏరియా ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొన్నారు .

ఎంఇఒలకు వృత్యంతర శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖ అధికారులకు ఆన్లైన్ సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వి విజయ్ రామరాజుకు ఆదివారం లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేశారు. పాఠశాలల పర్యవేక్షణతో పాటు పాఠశాల కార్యక్రమాలు, విద్యా పథకాలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ రకాల యాప్స్ ద్వారా, ఆన్లైన్ ద్వారా ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ వారికి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందచేయాల్సి ఉంటుం దన్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల సమాచారాన్ని ఆన్లైన్లో పంపించేందుకు కొన్ని సాంకేతికపరమైన అంశాలపై శిక్షణ ఇచ్చినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కావున కనీసం రెండు రోజుల పాటు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాత్రి వేళ పశువుల అక్రమ తరలింపు

ప్రజాశక్తి - భామిని

మండలం మీదుగా ఒరిడిశా నుంచి అక్రమంగా పశువులను రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. రాత్రులు వందల సంఖ్యలో పశువులు తరలించడంపై పలు అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. సంత పేరుతో పశువులను రాత్రిపూట తరలించి క్రయవిక్రయాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వందల సంఖ్యలో పశువులు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పశువుల తరలిస్తున్న వ్యక్తులను వివరణ కోరితే ఒడిశాలోని భామిని నుండి పశువుల్ని తీసుకొస్తున్నామని తెలిపారు. యజమాని చెప్పిన ప్రదేశానికి పశువులనే తరలిస్తే మాకు ఒక్కొక్కరికి రూ.1500 కూలి ఇస్తారని తెలిపాడు. పశువులను చెప్పిన ప్రదేశానికి చేర్చడమే మా బాధ్యతని మిగతా విషయాలు తెలియవని తెలిపారు. ఎవరైనా అడిగితే సంతకి తోలుకు వెళున్నానని చెప్పామన్నారని తెలిపారు. సంతకు ఒకరిద్దరు వ్యక్తులు వందల సంఖ్యలో పశువులు తరలిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్ణీత ప్రదేశానికి పశువులను తరలించి అక్కడి నుంచి వాహనాల్లో తరలింపు కొనసాగుతుందని పలువురు ఆరోపించారు. అధికారులు చొరవ తీసుకొని పశువుల రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి - గురుగుబిల్లి

మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు హెచ్చరించారు. మండలంలోని రావివలస జంక్షన్లో ఆటో డ్రైవర్లు, షాపు యజమానులతో అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలను పాటిస్తూ ఆటో డ్రైవర్లు ఆటోలను జాగ్రత్తగా, పరిమితి వేగంతో, నిర్లక్ష్యం లేకుండా నడపాలని తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని అన్నారు. అలాగే సైబర్ క్రైమ్ కు గురికాకుండా ఉండాలంటే మీ వ్యక్తిగత సమాచారాన్ని ఆన్లైన్లో ఎవరికి ఇవ్వొవద్దని, ఒటిపిలుగానీ, పాస్వర్డ్ గానీ బ్యాంకు వారు అడుగుతున్నారని ఇవ్వకూడదని సూచించారు.

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

సూర్య పీఠంలో చండీ హోమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల సూర్య పీఠంలో వేంచేసియున్న అంబికా దేవి ప్రీతికరంగా సౌరదీక్షలో శ్రీచక్రపూజ, అనంతరం చండీ హెూమం ఆదివారం నిర్వహించారు. పీఠంలో వేంచేసియున్న రమాసత్యనారాయణ స్వామి, లక్ష్మీగణపతి స్వామి ఉమామృత్యుంజయేశ్వర స్వామి, గాయత్రిచ సావిత్రి, మూలమంత్ర హవనా లు చేశారు. ఈ కార్యక్రమాన్ని వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో జరిపించారు. వైదిక సహకారాన్ని వేమకోటి వివేకానంద్, రామకష్ణ శర్మ, తదితరులు అందించారు..

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట



మండలంలోని కొటికిపెంట పంచాయతీ గోగాడవలసకు చెందిన కోట పోలిరాజు (37) శనివారం రాత్రి లారీ ఢీకొని మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. గోగాడవలసకు చెందిన కోట పోలిరాజు కుడుమూరు జంక్షన్ వద్ద శనివారం రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా హరిత రహదారి పనులకు సంబంధించిన లారీ పోలిరాజును వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలిరాజు అన్న కోట లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. పోలిరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.